క్లుప్తంగా

పంచాయతీ అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న సుబ్రమణ్య యాదవ్

గంగాధరనెల్లూరు: పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని జీడీ నెల్లూరు సర్పంచ్ సుబ్రమణ్యాయాదవ్ తెలిపారు. స్థానిక సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఇంటి పన్నులు కట్టని వారు వెంటనే కట్టేలా చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఎంపీటీసీ సభ్యుడు హరిబాబు, ఉప సర్పంచ్ రాము, పంచాయతీ కార్యదర్శి అంజాద్‌బాషా, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో వళ్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

పాలసముద్రం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం తమిళ సంవత్సరాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమిళనాడు సరిహద్దులో ఉన్న అత్తిమ్మజేరి పేట మురుగన్ దేవాలయంలో విశేష పూజలు చేశారు. తమిళులు వేకువ జామునే తలస్నానమాచరించి, నూతన దుస్తులు ధరించి ఆలయాలకు వెళ్లారు. మురుగన్, వళ్లియమ్మవారికి పాలు, తేనె, నెయ్యి, చందనంతో అభిషేకాలు చేశారు. స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ చేసి, పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆరోగ్యసూత్రాలు పాటించాలి

గంగాధరనెల్లూరు: ప్రజలు ఆరోగ్యసూత్రాలు పాటించాలని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లె, ముసలయ్యగారిపల్లెలో శుక్రవారం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని కోరారు. ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తే దోమల్ని నివారించుకునేందుకు వీలుంటుందన్నారు. పౌష్టికాహారం తీసుకుని రక్తహీనత లేకుండా ఉండాలన్నారు. సీహెచ్‌ఓ గౌతమి,సిబ్బంది పాల్గొన్నారు.

ద్రౌపదీ దేవికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని ముస్తాబు చేశారు. పూజలనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

రూ.50 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఆర్ డీఈ దయాసాగర్

వెదురుకుప్పం: మండల కేంద్రంలో రూ.50 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు పీఆర్ డీఈ దయాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం షాపింగ్ కాంప్లెక్స్ స్లాబ్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపార వాణిజ్య పరంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. రూ. 50 లక్షలతో 12 గదులు నిర్మాణ పనులను శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. పీఆర్ ఏఈ కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సింధూజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పద్మనాభ రెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రోశిరెడ్డి ఉన్నారు.

అందరి సహకారం అవసరం

కార్వేటినగరం: పంచాయతీ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని సర్పంచ్ ధనంజయ వర్మ అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామసభలో సర్పంచ్ మాట్లాడుతూ వార్డు సభ్యులు క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, పరిష్కారానికి సహకరించాలని కోరారు. కార్యాలయాల పన్ను బకాయిలు చెల్లించేందుకు అధికారులు సహకరించాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఉపసర్పంచ్ శేషాద్రి, తహసీల్దార్ రఫీజ్ అహ్మద్, ఈఓపీఆర్డీ లక్ష్మీపతి, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్ పాల్గొన్నారు.

సామాజిక తాత్వికుడు అంబేడ్కర్



పుత్తూరులో నివాళులర్పిస్తున్న మంత్రి ఆర్కే రోజా



నగరి: నివాళులర్పిస్తున్న మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఒక్క కులానికో, మతానికో ప్రతినిధి కాదని..సామాజిక తాత్వికుడని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా తెలిపారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా పుత్తూరులోని అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి రోజా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, ఎంపీపీ మునివేలు, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్, ఆలయాల చైర్మన్లు రమేష్‌బాబు, మనోహర్‌రెడ్డి, లారీమోహన్, కౌన్సిలర్లు ఏకాంబరం, నరసింహారావు, చిట్టిబాబు, జాన్‌కెనడీ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే పుత్తూరు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ఐక్యంగా పనిచేయాలని కోరారు. కేక్ కట్ చేసి పంచారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, కౌన్సిలర్లు జాన్‌కెనడీ, బాలసుబ్రహ్మణ్యం, అంబేడ్కర్ ట్రస్ట్ సభ్యులు అపరంజి, కుప్పయ్య, సంపత్, లక్ష్మణమూర్తి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఎగువ గూళూరులో..

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన వ్యక్తి డాక్టర్ అంబేడ్కర్ అని మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి అన్నారు. ఎగువ గూళూరులో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంచి పెట్టారు. మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, సర్పంచ్ మురళీయాదవ్ తదితరులు పాల్గొన్నారు. వేపగుంటలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ మునివేలు పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ గిరిజాప్రసాద్, లక్ష్మణమూర్తి, బుజ్జి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నింద్ర: మండల కేంద్రంలో జగనన్న కాలనీలో, ఎంపీడీవో కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, మండల కన్వీనర్ వేణురాజు, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, పార్టీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి మేరి, కోఆప్షన్ సభ్యుడు అనిల్, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరి: పట్టణంలోని బస్టాండు ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి కార్యక్రమంలో మంత్రి ఆర్కేరోజా సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. నాయకులతో కలసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సమానత్వమే మతంగా, మానవత్వమే కులంగా సమాజ సేవలో అంబేడ్కర్ తరించారని, ఆయన జీవితం యువతకు ఆదర్శమని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, ఎంపీపీ భార్గవి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, వైస్ ఎంపీపీ కన్నియప్పన్, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, సాయి సంధ్యారాణి, నాయకులు కృష్ణమూర్తి, యాకోబు, ఎస్సీ ఆనంద్ కుమార్, మురుగ, దేశమ్మ ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, శశికళ, గుణశేఖర్, చిన్నదొరై తదితరులు పాల్గొన్నారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సేవా సంఘం వారు సీఎస్‌ఐ ఆస్పత్రి నుంచి ఓంశక్తి ఆలయం వరకు అంబేడ్కర్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. సంఘ నాయకులు గోవిందస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు గాంధీ పాల్గొన్నారు. దళిత్‌వారియర్ అండ్ సేవియర్ ఫౌండేషన్‌ను, డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేడ్కర్ యాప్‌ను ప్రారంభించారు. ఆర్డీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆర్డీవో సుజన నివాళులర్పించారు. సిబ్బంది, దళితనాయకులు పాల్గొన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో రామచంద్రన్ నివాళులర్పించారు.

విజయపురం: మండలంలోని పన్నూరులో అంబేడ్కర్ విగ్రహానికి వైస్ ఎంపీపీ మంజు బాలాజీ పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. నాయకులు ప్రసన్నకుమార్, నాగరాజు, రత్నం, రాజాదాస్, కుమార్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కలలుగన్న పాలన

వడమాలపేట: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ కలలు కన్న పాలన, ఆశయాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఆర్కే రోజా అన్నారు. వడమాలపేటలో అంబేడ్కర్ విగ్రహనికి పూలమాల వేసి ఆమె నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అన్ని పదవుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. మంత్రి సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి, డీసీసీబీ బ్యాంకు డైరెక్టర్ కరుణాకర్‌చౌదరి, వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి, పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, కాయం సింగిల్ విండో అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, సర్పంచులు శేషాద్రిరెడ్డి, ధర్మయ్య, ఎంపీటీసీ రవి, సోషల్ మీడియా కన్వీనర్ చంద్రారెడ్డి, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు జయంత్‌బాబు, గౌరవ అధ్యక్షుడు డేవిడ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.







పుత్తూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఎగువ గూళూరులో నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి, నింద్రలో..



నగరి: యువజన సంఘం ర్యాలీ



ఆర్డీఓ కార్యాలయంలో..



వడమాలపేట : కేక్ కట్ చేస్తున్న మంత్రి ఆర్కే రోజా

జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాల నివారణ



కరపత్రాలు విడుదల చేస్తున్న డాక్టర్ గోపాల్



పుత్తూరు : మొక్క నాటుతున్న కమిషనర్

నగరి: ముందు జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని ఫైర్ ఆఫీసర్ మస్తాన్ అన్నారు. శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకొని ఫైర్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్నిప్రమాదాలు అధిక శాతం నిర్లక్ష్యం కారణంగానే జరుగుతుంటాయని తెలిపారు. కరపత్రాలను విడుదల చేశారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.ఆర్ఎంవో గోపాల్, డాక్టర్ ప్రసాద్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు రూరల్: పుత్తూరు ఫైర్ స్టేషన్ వద్ద అగ్నిమాపక వారోత్సవాలను మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల కరపత్రాలను విడుదల చేశారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అగ్నిమాపక అధికారి నేతాజీ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్



వెదురుకుప్పం: నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నివాళులర్పిస్తున్న ఎంపీపీ హేమలత రెడ్డి



కార్వేటినగరం: కేక్ కట్ చేస్తున్న నేతలు



ఎస్సార్‌పురం: బహుమతి అందజేస్తున్న సర్పంచ్



పాలసముద్రం: నివాళులర్పిస్తున్న నాయకులు

వెదురుకుప్పం: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని జెడ్పీటీసీ సభ్యుడు సి. సుకుమార్ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం వెదురుకుప్పంలోని అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని బొమ్మన్‌దొడ్ల, కేవీఎం అగ్రహారం, తిరుమలయ్యపల్లె, నక్కలాంపల్లె, తెల్లగుండ్లపల్లె, ఆళ్లమడుగు, మొరవ గ్రామాల్లో కేక్ కట్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పద్మనాభరెడ్డి, సర్పంచ్ శిల్ప, బండి హేమసుందర్‌రెడ్డి, బట్టే సుబ్రమణ్యం, నారాయణరెడ్డి, వెంకటేశ్, గురవారెడ్డి, రోశిరెడ్డి, భీమశంకర్‌రెడ్డి, బొజ్జారెడ్డి, నరేష్‌రెడ్డి, అత్తూరు సురేష్‌రెడ్డి, భూపాలయ్య, పొన్నయ్య, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

చిత్తూరు అగ్రికల్చర్ (పెనుమూరు): అంబేడ్కర్ జయంతి వేడుకలను శుక్రవారం పెనుమూరులో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ హేమలత రెడ్డి తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి తదితరులు పూలమాలవేసి, నివాళులర్పించారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని ప్రభుత్వ,ప్రైవేటు కార్యాలయాల్లో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అన్నదానం నిర్వహించారు. నవీన్, చిన్ని, మండల కన్వీనర్ మణి, సర్పంచ్ దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా గాండ్లమిట్ట కూడలిలో కార్వేటినగరం పెద్ద దళితవాడ యువత ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, భారీ కేక్ కట్ చేసి పంచారు. టీకేఎంపేట, పాదిరికుప్పం, గోపిశెట్టిపల్లె గ్రామాలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, సర్పంచ్ గోవిందస్వామి, ఎంపీటీసీ సభ్యురాలు నందిని, ఏఎంసీ డైరెక్టర్ ఆకుల గోపి, శేషాద్రి, ఉద్యోగ సంఘ నాయకులు అయ్యాదొరై, ఆంజనేయులు, సదాశివయ్య, నరసింహులు, బాబు, గుర్రప్ప, రామకృష్ణ, భూపాల్, సుబ్రమణ్యం, రంగయ్య, విజయ్, పొన్నుస్వామి, దొరబాబు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సచివాలయాల్లో శుక్రవారం అంబేడ్కర్ జయంతి ఘనంగా జరుపుకున్నారు. పాలసముద్రం దళితవాడల్లో జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, సర్పంచ్ అయ్యప్ప, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేంద్రన్, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజ్ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి జరుపుకున్నారు. తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ శ్రీనివాసన్, ఎస్ఐ సురేష్ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆముదాలలో ఎంపీటీసీ సభ్యురాలు లిఖిత, సర్పంచ్ అనురేఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అలాగే పలు పంచాయతీల్లో సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, గాలి మహేష్ బాబు, శోభ, జీవిత, నరసింహరాజు, వైఎస్ ఎంపీపీ పుష్ప, లిల్లీ తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

అంబేడ్కర్ బాటలో జగనన్న పాలన



జీడీనెల్లూరు : కేక్ కట్ చేసి ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డికి తినిపిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప

గంగాధరనెల్లూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద బడుగు వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఢిల్లీకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అలాగే ముష్టిపల్లెలో వెంకటేష్ ఆధ్వర్యంలో, వెంకటాపురంలో రవి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

శ్రీరంగరాజపురం: అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఎస్ఆర్ పురంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ నూతన విగ్రహం ప్రారంభం కార్యక్రమానికి పుల్లూరు క్రాస్ రోడ్డు నుంచి ర్యాలీగా బయలుదేరి, మండల కేంద్రం వద్దకు చేరుకున్నారు. అనంతరం అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఎంతటి కష్టమైన పనైన చిత్తశుద్ధితో, పట్టుదలతో ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదిలేదని అంబేడ్కర్ జీవితం నేర్పుతుందన్నారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ పేదల బతుకులను మార్చడమే నిజమైన అభివృద్ధి అని, అది సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని అన్నారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తి ప్రదాత, మహా జ్ఞాని అని అన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి మాట్లాడుతూ సమాజంలో మార్పు కోసం అంబేడ్కర్ అహర్నిశలు కష్టపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సరిత, జెడ్పీటీసీ సభ్యుడు రమణ ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ హరిత తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పించడానికి అనర్హుడు బాబు

అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ ఎవరైనా దళిత కులంలో పుడతారా? అని నాడు చెప్పిన చంద్రబాబు నేడు అంబేడ్కర్‌కు నివాళులర్పించడం ఏమిటని ప్రశ్నించారు. కారంచేడు ఘటన, టీడీపీకి ఓటు వేయలేదని నెపంతో చిత్తూరు జిల్లాలోని పాదిరికుప్పం గ్రామాన్ని తగలబెట్టిన చరిత్ర చంద్రబాబుదే అని అన్నారు.

గడప గడపలో సంక్షేమ కాంతులు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని విలాసవరహాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మణి, నాయకులు అనంత రెడ్డి, దాము నాయుడు, జనార్దన్, డిసెంబర్ శెట్టి, గుణశేఖర్ నాయుడు, ప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ కృష్ణయ్య పాల్గొన్నారు.

సీఎం జగనన్నపై నమ్మకం





పచ్చికాపల్లంలో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు, కార్వేటినగరంలో నేతల ప్రచారం

వెదురుకుప్పం: మా నమ్మకం, మా నినాదం జగనన్నే అంటూ ప్రజలు తమ అభిప్రాయాన్ని చెబున్నారని జేసీఎస్ కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం మండలంలోని పచ్చికాపల్లం, తిరుమలయ్యపల్లె, బొమ్మయ్యపల్లె, పెరుమాళ్లపల్లె సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరరెడ్డి, నరేష్ రెడ్డి, అత్తూరు సురేష్‌బాబు, సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటా అపూర్వ ఆదరణ

కార్వేటినగరం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ఇంటింటా అపూర్వ ఆదరణ లభిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. శుక్రవారం మండలంలోని ముక్కరవానిపల్లె, గంగమాంబాపురం, ముక్కరవానిపల్లె ఏఏ డబ్ల్యూ, గంగమాంబాపురం హెచ్‌డబ్ల్యూ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలసి జగనన్నే మాభవిష్యత్తు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, పట్టాభిరెడ్డి, మురాజ్‌రెడ్డి, చందురాజు, పద్మనాభరెడ్డి, దొరస్వామి, రాజ, శోభన్‌బాబు, అర్జునయ్య పాల్గొన్నారు.

వివక్షకు తావులేని ప్రభుత్వం



సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి: ప్రజలకు మేలు చేసే విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి వివక్ష లేదని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శుక్రవారం సాయంత్రం మున్సిపల్ పరిధి 6వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే విషయంలో కులం, మతం, ప్రాంతం, పార్టీ వంటివి చూడకుండా లబ్ధి చేకూర్చుతున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మొదటి రోజునుంచే తమ కార్యకర్తలకు మాత్రమే పనిచేయాలని అప్పట్లో చంద్రబాబు నాయుడు బాహాటంగానే ప్రకటించారని గుర్తుచేశారు. వృద్ధులకు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటింటికీ వలంటీర్లు వచ్చి ఫించన్లు అందజేస్తున్న ప్రభుత్వం తమదని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, కౌన్సిలర్లు సాయిసంధ్యారాణి, దయానిధి, నాయకులు మురుగ, ఆనంద్‌కుమార్, తేన్‌మొళి, యాకోబు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తమిళ ఉగాది వేడుకలు



నగరి : పాలకుండల ఉత్సవంలో భక్తులు

నగరి: నగరి పట్టణ పరిధిలో తమిళ ఉగాది వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. తమిళనాడు సరిహద్దులో ఉండడంతో ఆ సంప్రదాయాన్ని ఎక్కువగా ఇక్కడ పాటిస్తారు. కొత్తపేట అగర వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పాలకుండల ఉత్సవం నిర్వహించారు. ఊరేగింపుగా తెచ్చిన పాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. బాలాజీ గోల్డెన్ సిటీలోని శ్రీవరసిద్ధి వినాయక, రాహుకేతు, నాగాలమ్మ ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు పూజలు, అలంకరణలు జరిగాయి. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మున్సిపల్ పరిధి కనుమమిట్ట వద్ద దక్షిణ కాళియమ్మన్ ఆలయంలో అన్నదాన కార్యక్రమం వందరోజులు దాటడం, తమిళ ఉగాది పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. కీళపట్టు మారుతీ కొండపై ఉన్న వేంబళగి అమ్మన్ ఆలయంలో, కేవీపీఆర్ పేట తొప్పయమ్మన్ ఆలయంలో, ఏకాంబరకుప్పంలోని తొప్పయమ్మన్, సుబ్రమణ్యస్వామి ఆలయం, సత్రవాడ శ్రీకరివరదరాజ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నింద్ర: తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ఓం శక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేక పూజలు, అలంకరణల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది.